సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 14, ఫిబ్రవరి, 2023



విజ్ఞాన సమాజానికి కృషి చేద్దాం

విజ్ఞాన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. 8లో



కేంద్రంపై దుష్ప్రచారం తగదు

నిధులు ఇవ్వడంలేదని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేయడం సరికాదని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. 8లో



సమస్యల పరిష్కారంలో విఫలం

విద్యారంగ సమస్యలపరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. 8లో

మందు.. విందు.. చిందు C/O ఫాంహౌస్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- శివార్లకు పాకుతున్న పాడు కల్చర్
- పగలు ప్రశాంతం.. రాత్రిళ్లు గానాబజానా
- మత్తులో తూగుతున్న యువత
- పోలీసులు దాడులు చేస్తున్నా పడని అడ్డుకట్ట



మొయినాబాద్: రేవ్ పార్టీలు.. ముజ్రా పార్టీలు.. పేకాట.. రహస్య మంతనాలు.. బేరసారాలు.. హుక్కా, గంజాయి, మద్యం వినియోగం.. ఇలా ఒకటేమిటి అన్నట్టు అసాంఘిక కార్యకలాపాలకు ఫాంహౌస్‌లు వేదికలవుతున్నాయి. ప్రశాంతంగా ఉండే శివారు ప్రాంతాల్లో రాత్రయితే చాలు గానాబజానా.. డీజే చప్పుళ్ల హోరెత్తుతున్నాయి. పోలీసులు నిఘా పెడుతున్నా.. తరచూ దాడులు నిర్వహిస్తున్నా ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శనివారం, ఆదివారం పోలీసులు 32 ఫాంహౌస్‌లపై దాడులు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 22 మందిని అరెస్టు చేశారు. ఒకప్పుడు నగరాల్లోనే కనిపించే పాడు కల్చర్ ఇప్పుడు శివార్లకు విస్తరించింది. చిన్నచిన్న పార్టీల పేరుతో ఫాంహౌస్‌ల్లో ఈవెంట్లు నిర్వహిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్నారు.

ఈవెంట్ల పేరుతో..

నగరం శివారు ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. వాటిలో నిత్యం ఏదో ఒక ఈవెంట్ జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో డ్రగ్స్ సైతం వినియోగిస్తున్నారు. ప్రధానంగా మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, కొత్తూరు, షాద్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోని ఫాంహౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు అధికంగా కొనసాగుతున్నాయి.

స్థానికులకు ఇబ్బంది

పగలంతా ప్రశాంతంగా ఉండే ఆయా ప్రాంతాలు రాత్రి సమయాల్లో మాత్రం గానా బజానాలు, డీజేల మోతతో ఊగిపోతున్నాయి. చాలా చోట్ల ఫాంహౌస్‌లు జనావాసాలకు అతి చేరువలో ఉండటంతో స్థానికులకు ఇబ్బందిగా పరిణమించింది. ఫాంహౌస్‌ల్లో జరిగే ఈవెంట్లకు వచ్చిన పోకిరీలు మద్యం మత్తులో జనావాసాల్లోకి వచ్చి గొడవలకు దిగుతున్నారు. ఇటీవల మొయినాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో పోకిరీలు అర్ధరాత్రి సమయంలో గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులకు గురిచేశారు. ఇటీవల దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలుకు సైతం ఫాంహౌసే వేదిక అయ్యింది.

కేసులు నమోదు చేస్తున్నా జాన్తా నై..

నగరానికి చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసి వాటిని ఆన్‌లైన్ ద్వారా అద్దెకు ఇస్తున్నారు. ఏదైనా వేడుక చేసుకోవాలనుకున్న వారు ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుంటారు. మద్యం వినియోగిస్తే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మద్యం, హుక్కా, గంజాయిని సైతం వినియోగిస్తున్నారు. ఫాంహౌస్‌లపై పోలీసులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా పూర్తిస్థాయిలో మాత్రం అరికట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వేడుక ఏదైనా అనుమతి తప్పనిసరి



ఫాంహౌస్‌లలో పార్టీలు, ఈవెంట్లు ఏవి నిర్వహించినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మద్యం వినియోగిస్తే దానికి సంబంధించి ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. చిన్న చిన్న వేడుకలు, పార్టీలు జరిగితే ఫాంహౌస్ యజమానులు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. వేడుకల్లో మాదకద్రవ్యాలు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డీకే లక్ష్మిరెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

- హుక్కా, మద్యం స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై లింగ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం .. కనకమామిడి రెవెన్యూ పరిధిలోని కేతిరెడ్డిపల్లి రోడ్డు పక్కన ఉన్న బిగ్‌బాస్ ఫాంహౌస్‌లో ఆదివారం అర్ధరాత్రి హుక్కా, మద్యం వినియోగిస్తూ పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా ఫాంహౌస్‌పై దాడి చేశారు. పది హుక్కా ప్యాకెట్లు, 12 బీరు బాటిళ్లు, 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈవెంట్ నిర్వాహకుడు ఉప్పల్‌కు చెందిన బీబీ స్వామి, ఫాంహౌస్ వాచ్‌మన్ గుల్బర్గాకు చెందిన అబ్దుల్ మజీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫాంహౌస్ యజమాని ముతవల్లి పరారయ్యాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు దాడి చేసిన ఫాంహౌస్

తెల్ల కుసుమ పంటపై రైతులకు అవగాహన



పూత దశలో ఉన్న తెల్ల కుసుమ పంటపై డ్రోన్ ద్వారా మందుల పిచికారీ

షాబాద్: నూనె గింజల సాగుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని భారతీయ నూనె గింజల పరిశోధనా డైరెక్టర్ డాక్టర్ మాథుర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో సోమవారం భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో తెల్ల కుసుమ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూనె గింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా గత సంవత్సరం అక్టోబర్‌లో షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్, ఎర్రోనిగూడ, బొబ్బిలిగామ, గోల్లూరుగూడ గ్రామాల్లో సుమారు 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్ 746 రకం కుసుమ విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పూత దశలో ఉన్న కుసుమ పంట సస్యరక్షణ చర్యల్లో భాగంగా ముద్దెంగూడలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేసినట్లు చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నూనె గింజల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ రమాదేవి, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ సతీశ్‌కుమార్, డాక్టర్ మంగేష్‌దేబే, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ పద్మయ్య, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, వ్యోమిక్ డ్రోన్ కంపెనీ ప్రతినిధులు, సీడ్ కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి అనిత

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు మంచి ఆశయంతో విద్యనభ్యసిస్తే అనుకున్నది సాధించవచ్చని వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి అనిత అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ ఆదర్శ పాఠశాల, ఎంపీ పటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బాలికల భద్రతపై సోమవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఎలా ఉండాలో తెలిపారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, ఎంపీపటేల్‌గూడ ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, ఉపాధ్యాయులు యాదగిరి రెడ్డి, వెంకటేశ్, అరుంధతి, ఆంజనేయులు, శేఖర్, మంగ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- ప్రతి కూలీకి పని కల్పించాలి
- డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్

యాచారం: ప్రతి కూలీకి చేతినిండా పని కల్పించాలని, పని దొరకడం లేదనే ఫిర్యాదులు వస్తే సహించేది లేదని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ హెచ్చరించారు.మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో సోమవారం యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల మండలాలకు సంబంధించి ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి హామీ పథకం పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాబ్ కార్డులు కలిగిన కూలీలంతా ఉపాధి పనికి వచ్చేలా చూడాలని, చేసిన పనులకు వారంలోపే వేతనాలు అందేలా కృషి చేయాలన్నారు. పక్షం రోజుల వ్యవధిలోనే ప్రతి గ్రామం నుంచి 50 శాతం కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చైతన్యం కల్పించాలని, గుర్తించిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీరు, నీడ, వైద్య సామగ్రి, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో యాచారం ఏపీఓ లింగయ్య, ఆయా మండలాల ఏపీఓలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లిదండ్రులకు హారతి ఇస్తున్న విద్యార్థులు

షాబాద్: తల్లిదండ్రులను దైవసమానులుగా గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందని సంత్ శ్రీ ఆశ్రమం సంచాలకులు యుగ్నేశ్వర్ నాయుడు, పరమేశ్వర్, డాక్టర్ అమరనాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో సోమవారం సంత్ శ్రీఆశారాంజీబాపు ఆశ్రమం, శ్రీ యోగా వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో మాతృ, పితృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులతో మాతృ, పితృ పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు పాశ్చాత్యపోకడలకు పోకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలన్నారు. నేటి యువత తల్లిదండ్రులను గౌరవించని పరిస్థితిలోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర పాఠశాలప్రధానోపాధ్యాయులు నర్సింహులు, డాక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల విలువను విద్యార్థి దశ నుంచే వివరించి.. పిల్లలకు తల్లిదండ్రులంటే దైవంతో సమానమనే భావన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, ఝాన్సీ, కృష్ణకుమారి, ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ అమర్‌నాథ్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

జూపార్కు టికెట్ మొబైల్ యాప్ ప్రారంభం

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శకుల సౌకర్యార్థం ఎంట్రీ టికెట్ బుకింగ్, బ్యాటరీ వెహికిల్స్‌ను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని సోమవారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూపార్కు సందర్శకులు సులభంగా తమ సందర్శన టికెట్లను బుక్ చేసుకునేందుకు సౌకర్యంగా మొబైల్ యాప్, బ్యాటరీ వెహికిల్స్ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

వెటర్నరీ ఆస్పత్రులు ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులు చాలామంది ఉన్నారని.. పశువులను కాపాడుకునేందుకు వెటర్నరీ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతులు వెటర్నరీ ఆస్పత్రులు తగినన్ని లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే సకాలంలో వైద్య సేవలు అందించకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలాల్లో వెటర్నరీ ఆస్పత్రులను ఏర్పాటుచేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పిడుగుపాటుకు గురై పశువులు, గొర్రెలు మృతి చెందడంతో వాటినే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాంటి రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరెకటికెల అభివృద్ధికి ప్రభుత్వం హైదరాబాద్‌లో మాంసం దుకాణాలను ఏర్పాటు చేస్తోందని, ఆరె కటికెలకు వృత్తిపరంగా ఆయా దుకాణాల్లో ఉపాధిని చూపాలని కోరారు.



రోడ్డు విస్తరణకు సహకరించండి

- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) నారాయణనాయక్ అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 75 ఫీట్ల రోడ్డు విస్తరణకు సహకరించి పట్టణ అభివృద్ధికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించాలంటే రోడ్లు విశాలంగా ఉండాలన్నారు. రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తీరేందుకు అవకాశం ఉంటుందన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్డు పనులను చేపట్టాలని సూచించారు. పరిగి రోడ్డులోని విద్యుత్ కార్యాలయం సమీపంలో వాహనాలను మళ్లించేందుకు యూ టర్న్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, ఏసీపీ కుషాల్కర్, పట్టణ సీఐ నవీన్‌కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీశైలం యాదవ్, ఆర్అండ్‌బీ డీఈ రవీందర్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్

పొత్తున్నా పోరాటం చేస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని

హయత్‌నగర్: బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం కొనసాగిస్తామని, పేదలకు ఇళ్ల స్థలాలు సాధించే క్రమంలో పోలీసులు పెట్టే కేసులకు భయపడేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీలో జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అర్హులైన పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకున్నారని వారికి మౌలిక సదపాయాలు అందకుండా అధికారులు శత్రు దేశాలకంటే హీనంగా చూస్తున్నారని మండిపడ్డారు. ఓ భూస్వామి భూదానం చేసిన ఈ భూమి ప్రజలకు చెందాల్సి ఉండగా ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని, వంద ఎకరాల ఈ భూమి ఒకే వ్యక్తి పేరుతో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఈ భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారి పేర్లు చెబుతామని, చిత్తశుద్ధి ఉంటే అధికారులు వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న వారి తరలింపు ప్రభుత్వ తరం కాదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. పేదల స్థితిని అర్థం చేసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని.. ప్రభుత్వం స్థలాలు ఇస్తే కాలనీకి కేసీఆర్ పేరునే పెడతామని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు వేణుగోపాలచారి, పల్లె నర్సింహ, సైదులు అరుణ, నవనీత, సుజాత శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనమనేని సాంబశివరావు

చాపకింద నీరులా..

జిల్లాలో విస్తరిస్తున్న టీబీ

- కేసుల్లో రెండో స్థానంలో జిల్లా
- ఐదేళ్లలో 670 మంది మృత్యువాత
- అవగాహన లేమి.. చికిత్సలో జాప్యం
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చాపకింది నీరులా జిల్లాలో టీబీ విస్తరిస్తోంది. ఏటా వంద మందికిపైగా మృత్యువాతపడుతున్నా వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపానికి తోడు.. జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు ఆయా బస్తీలు, పల్లెల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించకపోవడం.. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించకపోవడం.. వేళకు మందులు సరఫరా చేయకపోవడం శాపంగా మారింది. అధికారుల తాజా లెక్కల ప్రకారం అత్యధిక టీబీ కేసులు నమోదవుతున్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఉన్నాయి.

ఒకరి నుంచి 15 మందికి..

ఒకరి నుంచి సుమారు 15 మందికి టీబీ విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యంగా హెచ్ఐవీ, కేన్సర్, మూత్ర పిండాల వైఫల్యం, కాలేయ సమస్యలు, మధుమేహులు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఎక్కువగా ఈ వ్యాధి బారినపడుతుంటారు. శరీరంలోని జుట్టు, గోర్లు మినహా అన్ని భాగాలకు ఇది సోకుతుంది. ఊపిరితిత్తులు, పేగులు, మూత్ర పిండాలు, మెదడు, వెన్నెముఖ, శోషరస గ్రంధులు (లింప్‌నోడ్స్)లకు సోకుతుంది. తీవ్రమైన దగ్గు, సాయంత్ర వేళ తరచూ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దగ్గినప్పుడు తెమడ ద్వారా ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. గాలిలోకి బ్యాక్టీరియా ప్రవేశించి శ్వాస తీసుకున్నప్పుడు ఊపిరితిత్తుల్లోకి చేరి లంగ్ టీబీకి దారితీసే ప్రమాదం ఉంది. ఎక్సరే పరీక్షల్లో దీన్ని గుర్తించొచ్చు. సీటీ, ఎంఆర్ఐ పరీక్షల్లో బోన్ టీబీని, ఎండోస్కోపి పరీక్షలతో పొత్తి కడుపులోని టీబీని గుర్తించొచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య సేవలు అందకపోవడంతో చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో నమోదవుతున్న కేసుల్లో 30 శాతం ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వెలుగు చూస్తున్నవే కావడం విశేషం.

టీబీ కేసులు ఇలా

సంవత్సరం	2018	2019	2020	2021	2022
మొత్తం పరీక్షలు	13,926	23,210	15,826	13,133	37,425
పాజిటివ్ కేసులు	3,400	4,786	4,294	4,428	5,078
బాధితుల్లో చిన్నారులు	238	242	184	188	246
మృతులు	111	181	141	143	105
చనిపోయిన వారి వయస్సు	45-67	45-65	40-75	55-74	40-65
చికిత్స తర్వాత కోలుకున్నవారు	3,194	4,493	4,003	4,127	-

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఎయిడ్స్ రోగులు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా దీని బారినపడుతుంటారు. రోగి దగ్గినప్పుడు వెలువడే తెమడ, తుంపర్లు గాల్లో కలవడం ద్వారా ఇతరులకు సోకుతుంది. అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడంతో పాటు సకాలంలో వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మందులు పంపిణీ చేయడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు టెస్టులు చేసి..తీవ్రతను అంచనా వేస్తున్నాం. బాధితులు త్వరగా కోలుకుని రికవరీ అవుతున్నారు. టీబీ రోగులకు ఆరు నెలల పాటు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 ఆర్థిక సాయం కూడా అందజేస్తోంది. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు, కంపెనీలు సామాజిక బాధ్యతగా రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్నారు. టీబీ బారినపడకుండా ఉండాలంటే ఎవరికి వారు వ్యక్తిగత వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం ఒక్కటే మార్గం.

– డాక్టర్ అరుణకుమారి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్, షాబాద్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఫెడరేషన్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారి హాజరై మాట్లాడారు. 8 సంవత్సరాల నుంచి విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేక నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల వల్లే ఇటీవల షెడ్యూల్ రావడం జరిగిందన్నారు. పాఠశాలల్లో నియామకాలు లేకపోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయలేక పోతున్నాయని అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్ ఎయిడెడ్, గురుకులాలు, మోడల్స్ స్కూల్‌గా వివిధ యాజమాన్యాల కింద పని చేస్తున్నాయని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందని ఆరోపించారు. ధనిక రాష్ట్రమని చెపుతున్న తెలంగాణలో ఒకటో తేదీన వేతనాలు పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఫెడరేషన్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలు, మండల అధ్యక్షులు కృష్ణయ్య, సత్యం, కృష్ణ, శేఖర్‌గౌడ్, రాజ్‌కుమార్, రాజేశ్వరి, అరుణ, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలకు ల్యాబ్‌లు దోహదం

- ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య
- ఎన్కెపల్లి పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న పోచయ్య

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ పోచయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఎన్కెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో యునైటెడ్ ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏఎండీ సహకారంతో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు ప్రయోగశాలలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానవంతులు అవుతారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందన, ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ రమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యాపారి రిమాండ్

మీర్‌పేట: మొక్కజొన్నలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకపోగా, అడిగినందుకు చిరు వ్యాపారిపై దాడికి పాల్పడిన ఓ వ్యాపారిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బడంగ్‌పేట శ్రీమారుతీ నగర్‌కు చెందిన చాట్ల నాగభూషణం వ్యాపారి. ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి చెందిన చిరు వ్యాపారి ఇరుగు వెంకటేశ్వర్లు పరిసర గ్రామాల రైతుల వద్ద మొక్కజొన్నలు కొనుగోలు చేసి వ్యాపారస్తులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం నాగభూషణం 13 లారీల మొక్కజొన్నల లోడ్‌ను వెంకటేశ్వర్లు నుంచి వేయించుకుని, రూ.43 లక్షలకు గాను 23 లక్షలు ఇచ్చి, మిగిలిన డబ్బును ఇవ్వకుండా వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో వెంకటేశ్వర్లు తన భార్యాపిల్లలతో పాటు, రైతులను తీసుకుని ఈ నెల 8వ తేదీన బడంగ్‌పేటలోని నాగభూషణం ఇంటికి వచ్చి మిగతా డబ్బులను ఇవ్వాలని అడగడంతో నాగభూషణం దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన వెంకటేశ్వర్లు వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, వెంటనే అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు భార్య యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు వ్యాపారి నాగభూషణాన్ని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఇబ్రహీంపట్నం: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీహరిని నాలుగవ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి నిర్వాహకులు నగదు పురస్కారం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్, గైడ్ టీచర్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహరిని వారు అభినందించారు.


నగదు పురస్కారం అందుకుంటున్న శ్రీహరిని

‘దళిత బంధు’ దేశానికే ఆదర్శం

మంత్రి సబితారెడ్డి
- దళితులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం
- త్వరలో మరికొంత మందికి లబ్ధి


మంత్రి సబితారెడ్డితో దళితబంధు లబ్ధిదారులు, సర్పంచ్ అనితారెడ్డి

మహేశ్వరం: దళిత బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఘట్టుపల్లికి చెందిన 10 మంది దళిత బంధు లబ్ధిదారులు స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో మంత్రిని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పథకం దళితుల సాధికారతకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారునికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. పథకం అమలు కాని వారు ఆందోళన చెందవద్దని రెండో విడత ఉంటుందని, మరికొంత మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. 2023–24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 1700 కోట్లు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి పక్షాలు దళిత బంధు పథకంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ఆమె సూచించారు. దళిత బంధు పథకం కింద ఘట్టుపల్లి గ్రామంలో 10 మంది లబ్ధిదారుల్లో ముగ్గురు గేదెలు, ఆవులు కొనుగోలు చేసి డెయిరీ ఫాం ఏర్పాటు చేశారని, ఆరుగురు వాహనాలు కొనుగోలు, ఒకరు టైలరింగ్ సామగ్రి షాపు ఏర్పాటు చేసుకొని ఆర్థిక లబ్ధి పొందుతున్నారు. అనంతరం మంత్రి లబ్ధిదారులతో మాట్లాడి వారు చేసే వ్యాపారం గుర్తించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరుపోలు అనితారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య, మాజీ సర్పంచ్ మేకల సౌదయ్య యాదవ్, ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు డీ శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ ఎస్ శ్రీశైలం, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సాదత్, వార్డు సభ్యులు బీ రవి, ఎర్ర స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బైకని అంజయ్య యాదవ్, లబ్ధిదారులు శంకరయ్య, అండాలు, అంజయ్య, శేఖర్, భాస్కర్, బీ రవి, స్వామి, బాల్‌రాజ్, రవి, నర్సింహ పాల్గొన్నారు.

కేంద్రంపై దుష్ప్రచారం తగదు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుద్దాల దేవయ్య



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

ఇబ్రహీంపట్నం: రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలేదని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుండం సరికాదని మాజీ మంత్రి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుద్దాల దేవయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో సోమవారం జరిగిన బీజేపీ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లకు, శ్మశాన వాటికలు, రైతు వేదికలకు, జాతీయ రహదారులకు, పట్టణాలు, పల్లెలకు కేంద్ర ప్రభుత్వం తన వాట కింద నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లిస్తోందని తెలిపారు. మూతపడిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని తిరిగి తెరిపించింది, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించింది, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలతోపాటు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నిధులను కేటాయిస్తోంది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల హామీ రైతు రుణమాఫీ ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంట్ ఎక్కడా రావడం లేదన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, నాయకులు బోసుపల్లి ప్రతాప్,పొరెడ్డి నర్సింహారెడ్డి, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, జక్క రవీందర్‌రెడ్డి, బూడిద నర్సింహారెడ్డి, గొట్టం శ్రీశైలం, కాళిదాసు, వెంకటేష్‌గౌడ్, బండి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి

పొలం పనులు చేస్తుండగా ప్రమాదం


శ్యాంసుందర్ (ఫైల్)

షాబాద్: విద్యుత్ షాక్‌కు గురై ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ కథనం మేరకు.. మండలంలోని ఊబ్బగుంట గ్రామానికి చెందిన చిల్కమర్రి శ్యాంసుదర్(18) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఉదయం అమ్మ, అన్నతో కలిసి పొలం వద్దకు వెళ్లారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమై మిరప తోటకు నీళ్ల మలుపుదామని ఇనుప పైపును పట్టుకున్నాడు. ఇనుప పైపుకు కేసింగ్ వద్ద కరెంటు కేబుల్ వైర్ తేలి ఉంది. అది గమనించని శ్యాంసుందర్ పట్టుకోగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గీత కార్మికుడికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోల్కంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్సం యాదయ్య గీత కార్మికుడు. రోజు లాగే తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా కాలు జారి చెట్టు పైనుంచి కింద పడ్డాడు. తోటి కార్మికులు యాదయ్యను ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఆనంద్ మృతదేహం

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన పి.శశాంక్(22) అతని స్నేహితులు పి.సాయి కుమార్(23), ఉదయ్ కిరణ్ చంద్ర(25), ఆనంద్(23), వరణ్‌గౌడ్(23)లు రావిరాలలోని స్నేహితుడు సంతోష్ వివాహ రిసెప్షన్‌కు హాజరై ఆదివారం అర్ధ రాత్రి కారులో తిరిగి వచ్చే క్రమంలో తెలంగాణ హౌజింగ్ బోర్డు కాలనీ జంక్షన్ వద్ద అకస్మాత్తుగా ఇన్నోవా కారు డ్రైవర్ యూటర్న్ తీసుకోవడంతో అదుపుతప్పి న కారులో అందరికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలకు గురైన వెనుక సీటులో కూర్చు ఆనంద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

హైనా దాడిలో 12 గొర్రెల మృతి


హైనా దాడిలో మృతి చెందిన గొర్రెలు

కడ్తాల్: మండలంలోని కొండ్రిగానిబోడ్‌త తండా పంచాయతీకి చెందిన దాస్యనాయక్, రవినాయక్‌లకు చెందిన గొర్రెల మందపై సోమవారం తెల్లవారు జామున హైనాలు దాడి చేయడంతో 12 జీవాలు మృత్యువాత పడ్డాయి. మరో 3 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు రూ. లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. వరుసగా మండలంలోని పలు గ్రామాల్లో గొర్రెల మందపై హైనాలు దాడి చేసి చంపుతున్నాయని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఐరన్ రాడ్లు తరలిస్తున్న ఆటో సీజ్

ముగ్గురు వ్యక్తుల బైండోవర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

నందిగామ: ఆటోలో అక్రమంగా ఐరన్ రాడ్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం మేరకు.. మండల కేంద్రమైన నందిగామ శివారులో పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వెంచర్ నుంచి ఆటోలో ఐరన్ రాడ్లను తరలిస్తుండగా గమనించిన పోలీసులు మూడు రోజుల క్రితం పట్టుకున్నారు. స్టీల్‌కు సంబంధించి ఎలాంటి రశీదు లేకపోవడంతో ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు ప్రతాప్, మల్లేష్, దినేష్‌లను తహసీల్దార్ రహ్మాన్ ఖాన్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే మూడు రోజుల అనంతరం అరెస్టు చూపడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ రామయ్యను వివరణ కోరగా.. గతంలో స్టీల్ అక్రమ క్రయ విక్రయాలు జరిగేవని తెలిపారు. ఈ క్రమంలో దాడి చేసి ఆటోను పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజ్ఞాన సమాజానికి కృషి చేద్దాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి


గ్రంథాలయ భవన నిర్మాణంపై చర్చిస్తున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: విజ్ఞాన సమాజ నిర్మాణం కావాలంటే ప్రతి ప్రాంతంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకుంటేనే అది సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ సహకారంతో నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను సోమవారం స్థానిక కౌన్సిలర్లు గొపగల్ల మహేందర్, హరిదాస్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పౌర పఠన మందిరాల పేరిట ప్రతి మండలానికి రెండు మేజర్ గ్రామ పంచాయతీల్లో లైబ్రరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అమెజాన్ లాంటి స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పక్కా భవనాలు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో అమెజాన్ సంస్థ సహకారంతో పది గ్రంథాలయాలు నిర్మిస్తున్నామని, వీటి నిర్వహణ బాధ్యత గ్రంథాలయ సంస్థ చేపడుతోందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు ఎనిమిది పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేస్తున్నామని, నాలుగు కొత్త గ్రంథాలయాలను నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తుండడంతో గ్రంథాలయాలను నిరుద్యోగ యువతకు స్టడీ సెంటర్లుగా ఉపయోగపడేలా చేశామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి, అమెజాన్ సంస్థ ప్రతినిధి సురేష్, నాయకులు కొత్త ప్రవీణ్‌గౌడ్, దేవరపల్లి శ్రీనివాస్‌గౌడ్, ముక్కెర నారాయణ, నర్సగల్ల ప్రవీణ్, కాకి సంతోష్, గోదాసు మధు, పండాల గోపాల్‌గౌడ్, సీళ్ల శ్రీకాంత్‌గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పరిగి డీఎం పవిత్ర


పరిగి - శ్రీశైలం బస్సును ప్రారంభిస్తున్న డీఎం పవిత్ర, పాల్గొన్న సిబ్బంది

పరిగి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి డీఎం పవిత్ర సూచించారు. సోమవారం పరిగి నుంచి శ్రీశైలానికి బస్సును ప్రారంభించారు. బస్సులోని ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు, శివస్వాములు అధిక సంఖ్యలో శ్రీశైల దర్శనానికి వెళుతుంటారని, వారు ఇబ్బందులు పడరాదనే ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10గంటలకు పరిగి నుంచి శ్రీశైలానికి బస్సు బయలు దేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.